సాక్షి
జనగామ
మంగళవారం । 2 । మే । 2023



సమీకృత చేపల పెంపకం చేపట్టాలి

వ్యవసాయానికి అనుబంధంగా రైతులు సమీకృత చేపల పెంపకం చేపట్టాలని మామునూరు కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న తెలిపారు. - 8లో▸



సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి

విద్యుత్ సంస్థలు కష్టాల్లో ఉన్నాయి.. కాపాడుకోవాల్సిన బాధ్యత ఇంజనీర్లుగా మనపై ఉందని ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీసీరెడ్డి అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
32^0 /24^0

వాతావరణం

ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై చల్లని వాతావరణం ఉంటుంది. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి.

రెక్కల కష్టమూ పాయె..

నిండా ముంచిన అకాల వర్షం

- ఆదివారం రాత్రి కురిసిన వానకు 749 ఎకరాల్లో పంట నష్టం
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- వరద నీటిలో కొట్టుకు పోయిన గింజలు
- నగటు వర్షపాతం 899.6 మిల్లీమీటర్లు నమోదు
- ఇప్పటి వరకు 56వేల ఎకరాల్లో వరి, మొక్కజొన్న, మామిడి పంటలు ధ్వంసం



దేవరుప్పుల మండలం సీతారాంపురంలో నీట మునిగిన ధాన్యం కొనుగోలు కేంద్రం



స్టేషన్‌ఘన్‌పూర్: నేలకొరిగిన వరి పంట

జనగామ: జిల్లాలో పది రోజులుగా వరుసగా కురుస్తున్న వడగళ్లు.. అకాల వర్షాలకు వరి, మొక్కజొన్న పంటలు, మామిడి తోటలు తుడిచిపెట్టుకుపోయాయి. కోతకు వచ్చిన వరి రాళ్ల వానతో 50శాతం దెబ్బతినగా.. అకాల వర్షాలతో కోసిన ధాన్యం తడిసి మొలకలొచ్చి అమ్ముకోలేని పరిస్థితి నెలకొంది. అన్నదాతలు ఆరుగాలం పడిన రెక్కల కష్టం నీటిపాలైంది. పంటలకు చేసిన అప్పులే మిగిలాయి. జిల్లాలో ఇప్పటి వరకు వరి, మొక్కజొన్న, మామిడి పంటలు సుమారు 56వేల ఎకరాల్లో నష్టం జరిగింది. ఆదివారం రాత్రి తరిగొప్పుల, చిల్పూరు, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, దేవరుప్పుల మండలాల పరిధి 23 గ్రామాల్లో 252 మంది రైతులకు చెందిన 740 ఎకరాల్లో వరి, 2 ఎకరాల్లో మొక్కజొన్న, 7 ఎకరాల్లో మామిడి.. మొత్తంగా 749 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ జిల్లా అధికారి వినోద్‌కుమార్ తెలిపారు. అనేక చోట్ల వరి నీట మునిగిపోగా.. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి వరదలో కొట్టుకుపోయింది. గాలి దుమారానికి జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తా, జ్యోతినగర్, బాలాజీనగర్ ఏరియాలో హోర్డింగ్‌లు కూలాయి. ఫ్లెక్సీలు కరెంటు తీగలపై పడి మంటలు చెలరేగాయి. విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది స్పందించడంతో ప్రమాదం తప్పింది.

15,053 టన్నుల ధాన్యం కొనుగోళ్లు

జిల్లాలో ఇప్పటి వరకు 195 ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల పరిధిలో 15,053 టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, 13,500 టన్నులు మిల్లులకు తరలించారు. బచ్చన్నపేట మండలంలో వందశాతం పంటకు నష్టం జరగ్గా.. అక్కడ మూడు సెంటర్లు ఎత్తివేశారు. రెండు రోజుల క్రితం కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం తరలించేందుకు నాన్ కర్షియల్ ట్రాక్టర్లకు అనుమతి ఇవ్వకపోవడంతో రవాణా పరంగా ఆలస్యమవడంతో నష్టం ఎక్కువైందని రైతులు చెబుతున్నారు.

జనగామ రూరల్: జనగామ మండల చౌడారం, వడ్లకొండ, గానుగుపహాడ్, వెంకిర్యాల, అడవికేశ్వాపూర్ గ్రామాల్లో ధాన్యం తడిసి మొలకెత్తింది. పొలాల్లో నీరు చేరడంతో పంట దెబ్బతింది. మరిగడిలో వైకుంఠధామం రేకులు ఎగిరిపోయాయి.

దేవరుప్పుల: సీతారాంపురం, దేవరుప్పుల, పెద్ద మడూరు తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. ఐకేపీ 11 కేంద్రాల్లో 16,461 క్వింటాళ్లు, పీఏసీఎస్ 9 కేంద్రాల్లో 10,290 క్వింటాళ్ల తడిసిన ధాన్యాన్ని కాంటా పెట్టి రైస్ మిల్లులకు తరలించారు. కొనుగోలు కేంద్రాలకు లారీలు సకాలంలో రాకపోవడంతో మూడు రెట్ల ధాన్యం పేరుకుపోయింది. ప్రధానంగా సీతారాంపురంలో గొలుసుకట్ట కాల్వలోకి వర్షపు నీరు చేరడంతో వరద ఉధృతికి కట్టతెగి కొనుగోలు కేంద్రంలోని ధాన్యం నీట మునిగింది. స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి జేసీబీ ద్వారా నీటిని తొలగించే చర్యలు చేపట్టారు.

లింగాలఘణపురం: మండల పరిధి స్వార్చుగూడెంలో పిడుగు పడి కాడెద్దు మృతి చెందింది. పటేల్‌గూడెం కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసిపోగా ఇన్‌చార్జ్ ఆర్డీఓ మన్సూరీ పరిశీలించారు.



జఫర్‌గఢ్: వరదకు కొట్టుకు పోయిన ధాన్యం

కొడకండ్ల: మండలంలోని పీఏసీఎస్, ఐకేపీ కేంద్రాల్లో 14,524 బస్తాల ధాన్యం కొనుగోలు చేశారు. రాత్రి కురిసిన భారీ వర్షానికి టార్పాలిన్ కవర్లు కప్పినా ధాన్యం తడిసి పోయింది.

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం, సముద్రాల, కోమటిగూడెం, కొత్తపల్లి, మీదికొండ, నమిలిగొండ తదితర గ్రామాల్లో వందల ఎకరాల్లో వరి పంట నేలవాలింది. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోస్తూ రైతులు ఇబ్బంది పడ్డారు. కొత్తపల్లి, నమిలిగొండ, స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఆరు విద్యుత్ స్తంభాలు కూలి పోవడంతో కరెంటు సరఫరా నిలిచిపోగా ఏడీఈ సత్యనారాయణ పర్యవేక్షణలో సిబ్బంది మరమ్మతు చేశారు. ఐకేపీ కేంద్రాల ద్వారా 7,887, పీఏసీఎస్ ద్వారా 6,500 బస్తాలు, ఓడీసీఎంఎస్ ద్వారా 5,700 బస్తాల ధాన్యం కొనుగోలు చేశారు



పాలకుర్తి/పాలకుర్తిటౌన్ : మండల పరిధి 21 పీఏసీఎస్, ఐకేపీ సెంటర్లలో ఇప్పటి వరకు 33వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. నిల్వ ఉన్న ధాన్యంతో పాటు రైతులు ఆరబోసుకున్న ధాన్యం వరద తాకిడికి కొట్టుకు పోయింది. దర్దెపల్లి, విస్నూర్ గ్రామాల్లో ధాన్యం నీట మునగడంతో జేసీబీ సహాయంతో నీటిని పక్కకు మళ్లించారు.

జఫర్‌గఢ్: మండల పరిధి పీఏసీఎస్, ఐకేపీ 12 కేంద్రాల్లో 2,500 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. నిల్వ ఉన్న ధాన్యంతో పాటు రైతులు ఆరబోసుకున్న వడ్లు వర్షపు నీటిలో కొట్టుకుపోయాయి.

బచ్చన్నపేట: మండలంలో ఐకేపీ, పీఏసీఎస్ పరిధిలో 22 సెంటర్లు ఏర్పాటు చేయగా, ఇప్పటి వరకు 19,200 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. మద్దతు ధరకు ఆశపడి ధాన్యం తెచ్చిన రైతులు పొద్దంతా ఆరబోయడం.. రాత్రి వర్షానికి తడవడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు.

తరిగొప్పుల: ఐకేపీ, పీఏసీఎస్ పరిధిలో 9 సెంటర్లలో 730 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. తేమ శాతం ఎక్కువ రావడంతో కొనుగోళ్లు మందగించాయి. అబ్దుల్‌నాగారం, నర్సాపూర్, అక్కరాజుపల్లి, పోతారం, సోలిపురం, బొంతగట్టునాగారం, బొత్తలపర్రె, అంకుషాపూర్ గ్రామాల్లో రాత్రి వర్షానికి ధాన్యం తడిసి మొలకొచ్చే పరిస్థితి నెలకొంది.

- మరిన్ని చిత్రాలు 9లో▸



పక్క ఫొటోలోని రైతు పేరు గాజుల గట్టయ్య. జనగామ మండలం చౌడారం గ్రామానికి చెందిన ఈయన తొమ్మిది ఎకరాల్లో వరి సాగు చేశాడు. రూ.2.70లక్షల వరకు పెట్టుబడి అయింది. 500 బస్తాల దిగుబడి వస్తుందని ఆశపడ్డాడు. చివరి దశలో ఎండల తీవ్రతతో నీరు అందక.. తర్వాత అకాల వర్షాలు, వడగళ్లతో కేవలం 140 బస్తాల దిగుబడి మాత్రమే వచ్చింది. ఆ కొద్దిపాటి పంటను అమ్ముదామని కొనుగోలు కేంద్రానికి తీసుకువస్తే తేమ పేరిట కాంటా వేయడానికి ఆలస్యం చేశారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యం మొలకెత్తుతోంది. ఆదివారం రాత్రి కురిసిన వానకు ఉన్న వడ్లన్నీ తడిసి పోయాయి.

రికార్డు స్థాయిలో వర్షం

జిల్లాలో ఆదివారం రాత్రి 8.00 నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకు రికార్డు స్థాయిలో వర్షం నమోదైంది. పాలకుర్తిలో అత్యధికంగా 124.6 మిల్లీ మీటర్లు, కొడకండ్లలో అత్యల్పంగా 30.2 మి.మీ.. సగటు వర్షపాతం 899.6 మిల్లీ మీటర్లు నమోదైనట్లు సీపీఓ ఇస్మాయిల్ తెలిపారు.

జిల్లాలో వర్షపాతం నమోదు వివరాలు (మిల్లీ మీటర్లు)

మండలం	వర్షపాతం	మండలం	వర్షపాతం
తరిగొప్పుల	76.2	బచ్చన్నపేట	46.2
చిల్పూర్	58.4	జనగామ	68.8
జఫర్‌గఢ్	87.8	లి.ఘణపురం	100.8
స్టేషన్‌ఘన్‌పూర్	58.2	దేవరుప్పుల	122.8
రఘునాథపల్లి	77.0	పాలకుర్తి	124.6
నర్మెట	48.6	కొడకండ్ల	30.2

తడిసిన గింజలు మొలకెత్తాయి..



ఎనిమిది ఎకరాల్లో వరి సాగు చేసిన. పెట్టుబడికి రూ.2.40లక్షలు అయింది. వడగళ్లతో గింజలు రాలిపోగా.. చేతికి వచ్చిన పంటను మద్దతు ధరకు అమ్ముకుందామని వస్తే మళ్లా వాన వెంటపడ్డది. కొనుగోళ్లు ఆలస్యం కావడంతో తడిసిన గింజలు మొలకెత్తాయి. రూ.లక్ష కూడా వచ్చేటట్టు లేదు. పెట్టుబడికి చేసిన అప్పులు ఎట్ల తీర్చాల్నో తెలుస్తలేదు.

- ఎండీ.యాకూబ్, రైతు, వడ్లకొండ(జనగామ)



కొడకండ్ల మండల కేంద్రంలో..



తరిగొప్పల మండలం అక్కరాజుపల్లిలో..



పాలకుర్తి మండలం దర్దెపల్లి కొనుగోలు కేంద్రంలో..



మరిగడిలో ధ్వంసమైన వైకుంఠధామం షెడ్డు



కొత్తపల్లి పొలంలో కూలిన విద్యుత్ స్తంభం



జిల్లా కేంద్రంలో కూలిన హోర్డింగ్

న్యూస్‌రీల్

అవార్డు అందుకున్న 'ఆరోగ్యం'



స్టేషన్‌ఘన్‌పూర్: ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన శ్రమ శక్తి అవార్డును స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన రడపాక ఆరోగ్యం అందుకున్నారు. ఈ మేరకు హైదరాబాద్ రవీంద్రభారతిలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



జనగామ: తెలంగాణ రాష్ట్ర నూతన సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడాన్ని హర్షిస్తూ టీఎస్జీఓస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఖాజా షరీఫ్, కార్యదర్శి పెండెల శ్రీనివాస్, సంపత్, ఉప్పలయ్య, రామనర్సయ్య, ఆఫీజ్, రాజేష్, ప్రభాకర్, శివాజీ, విష్ణు రెడ్డి, శ్యామ్, రామకృష్ణ, పాండరి పాల్గొన్నారు.

సేవలు విస్తృతం చేయాలి



జనగామ రూరల్: మారుమూల ప్రాంతాల్లో లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృతం చేయాలని మల్టిపుల్ జీఎంటీ కోఆర్డినేటర్, సుప్రీం కోర్టు న్యాయవాది దీపక్ భట్టాచార్య అన్నారు. సోమవారం లయన్స్ జిల్లా గవర్నర్ కన్నా పరశురాములు ఆధ్వర్యంలో కెమిస్ట్రీ భవన్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. లయన్స్ క్లబ్ చేపట్టే సేవా కార్యక్రమాలతోపాటు వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ పురోగాభివృద్ధి, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి 320 ఎఫ్ చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి మచ్చా రాజిరెడ్డి, ఎస్.వెంకటేశ్వర్‌రావు, చంద్రశేఖర్, లవకుమార్, ప్రసాద్, అల్లాడి ప్రభాకర్, కృష్ణ జీవన్‌బజాజ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



జనగామ రూరల్: కార్మికులు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వరంగల్ అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కె.ప్రసాద్ అన్నారు. మే డే సందర్భంగా సోమవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని పూసల భవన్‌లో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్మికులు లేబర్ యాక్టులు తెలుసుకుని వాటి ప్రకారం ఆయా యాజమాన్యాల వద్ద పనులు చేయాలని, ఏమైనా సమస్యలు ఉంటే న్యాయ సలహాలు తీసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో జిల్లా లేబర్ అధికారి ఆర్.కుమారస్వామి, న్యాయవాదులు రవీందర్, జ్యోత్స్న, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి



జనగామ రూరల్: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలంటూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. సోమవారం నాలుగో రోజు జిల్లా వ్యాప్తంగా దీక్షలు చేపట్టారు. కళ్లకు గంతలు కట్టుకుని మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. పల్లెల ప్రగతికి పాటుపడుతున్న తమను క్రమబద్ధీకరిస్తూ పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెకు పలువురు సర్పంచ్‌లు మద్దతు తెలిపారు.

- మరిన్ని చిత్రాలు 9లో▸

ఆలయాలకు పూర్వవైభవం

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల: ఆధ్యాత్మిక చింతనతోనే శాంతి సమాజం తయారవుతుందన్న విశ్వాసంతో సీఎం కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తూ పూర్వవైభవం తేవడానికి కృషి చేస్తున్నారని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సింగరాజుపల్లిలోని పురాతన శివాలయాన్ని సందర్శించిన ఆయన ఆలయ పునరుద్ధరణకు రూ.50 లక్షలు మంజూరు చేసి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల, ఆస్పత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అన్ని మతాలకు సమాన ప్రాతిపదికన ప్రాధాన్యత ఇస్తూ.. ధూపదీప నైవేద్యంతోపాటు మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించారని పేర్కొన్నారు. ఇందుకు పాలకుర్తి, బమ్మెర, వల్మిడి తోపాటు ఇటీవల చేపట్టిన వానకొండయ్య గుట్ట అభివృద్ధి పనులే నిదర్శనమని చెప్పారు. అనంతరం ఇటీవల మరణించిన రామరాజుపల్లి బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త తోకల సోమనర్సయ్య, కప్పల నాథం కుటుంబాలను మంత్రి పరామర్శించారు. అలాగే చెట్టుపైనుంచి పడి కోలు కొంటున్న ఉప్పు నూతుల నారాయణకు సీఎం సహాయ నిధి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విజయ్, సర్పంచ్ మల్లేష్, పీఏసీఎస్ చైర్మన్ రమేష్‌రెడ్డి, పూజారి నరేష్‌శర్మ, ప్రసాద్, ఉత్సవ కమిటీ చైర్మన్ వంగాల వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సింగరాజుపల్లిలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి

ప్రజలు సుభిక్షంగా ఉండాలి

కొడకండ్ల: గ్రామ దేవతల ఆశీర్వాదంతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం మండల పరిధి రేగుల గ్రామంలో ప్రారంభమైన బొడ్రాయి, ముత్యాలమ్మ పునఃప్రతిష్ఠాపన పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొని గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. సర్పంచ్ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలను ఆదుకుంటాం

- అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

దేవరుప్పుల: అకాల వర్షంతో పంటలు నష్టపోయిన అన్నదాతలను ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకునేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడతామని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. మండల పరిధి కోలుకొండ, కడవెండి, సీతారాంపురం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సోమవారం పరిశీలించిన అనంతరం మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా దెబ్బతిన్న పంటల సర్వేకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, రైతులు ఆందోళన చెందకుండా మనోధైర్యంతో ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు తమ వంతు ప్రక్రియపై దృష్టి సారించాలన్నారు. జిల్లాలో చేపట్టిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పరిస్థితులపై ఎప్పటికప్పుడు కలెక్టర్ పర్యవేక్షణలో సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్, సమీక్ష సమావేశాల ద్వారా దిశా నిర్దేశం చేస్తున్నట్టు పేర్కొన్నారు. అనంతరం దేవరుప్పుల పారాబాయిల్డ్ రైస్ మిల్లును సందర్శించిన ఆయన.. తడిసిన ధాన్యం ఆపకుండా తీసుకుని రైతులకు సహకరించాలని యజమానికి సూచించారు. పెద్ద తండా, సీతారాంపురంలో ఉపాధి పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్.. వాతావరణ అనుకూలతలను సద్వినియోగం చేసుకుంటూ కూలీలు వంద రోజులు పనిచేసి వేతనం ఎక్కువగా పొందేలా పాటుపడాలని సూచించారు. కడవెండిలో 'మన ఊరు-మనబడి' పనులను పరిశీలించి సూచనలు చేశారు. డీఆర్‌డీఓ రాంరెడి, సివిల్ సప్లయ్ డీఎస్‌ఓ రోజారాణి, డీఎం సంధ్యారాణి, డీఈఓ రాము, తహసీల్దార్ ఎడ్ల రవీందర్‌రెడ్డి, సర్పంచ్‌లు రమేష్, బెల్లీనా, కోక్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.



సీతారాంపురంలో నీట మునిగిన ధాన్యం కుప్పను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కార్మికులు సహకరించాలి



కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న డీఎంఓ

స్టేషన్‌ఘన్‌పూర్: హమాలీలు, దడువాయి కార్మికులు బాధ్యతగా పనిచేస్తూ వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి సహకరించాలని జిల్లా మార్కెటింగ్ అధికారి నాగేశ్వరశర్మ అన్నారు. మే డే సందర్భంగా స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో పనిచేసే హమాలీలు, దడువాయి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన దుస్తులను ఆయన సోమవారం పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చైర్మన్ గుజ్జరి రాజు, కార్యదర్శి జీవన్‌కుమార్, వైస్‌చైర్మన్ చల్లా చందర్‌రెడ్డి, డైరెక్టర్లు సరిత, చల్లారపు శ్యామ్‌సుందర్, పెంతల రాజ్‌కుమార్, వరుణ్, ఐత సంతోష్, తాటికొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశానికి ఆహ్వానం

జనగామ రూరల్: ఒడిషా రాష్ట్రం బర్ల, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైండ్లూమ్స్ టెక్నాలజీ మూడేళ్ల కోర్సుల్లో ప్రవేశానికి 10వ తరగతి విద్యార్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి చౌడేశ్వరీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వ తేదీలోగా నెల్లూరు జిల్లా వెంకటగిరి శ్రీప్రగడ కోటయ్య మెమోరియల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైండ్లూమ్స్ టెక్నాలజీ, 524131 పిన్ నంబర్‌కు దరఖాస్తు అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

మంత్రి కేటీఆర్ పర్యటన షెడ్యూల్ విడుదల

- ఏర్పాట్లపై మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమీక్ష

సాక్షిప్రతినిధి, వరంగల్: రాష్ట్ర మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా చేపట్టనున్న ఏర్పాట్లపై సోమవారం హనుమకొండలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేలు అరూరి రమేష్, వొడితెల సతీష్‌కుమార్, మేయర్ గుండు సుధారాణి, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, అధికారులతో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమీక్షించారు. ఈనెల 5న వరంగల్ పర్యటనకు రానున్నారని, ఈ సందర్భంగా నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారన్న దయాకర్‌రావు షెడ్యూల్ ప్రకటించారు.

- ఉదయం 10 గంటలకు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొంటారు.
- మధ్యాహ్నం 3 గంటలకు హసన్‌పర్తి(ఎర్రగట్టు గుట్ట) కిట్స్ కళాశాలలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొని.. ఇంక్యుబేషన్ సెంటర్‌ను ప్రారంభించి, అక్కడ ఏర్పాటు చేసిన ఎగ్జిబిట్స్‌ను తిలకిస్తారు. అనంతరం హెచ్‌ఓడీలు, విద్యార్థులతో ఏర్పాటు చేసిన ముఖాముఖిలో పాల్గొంటారు.



సమీక్షలో పాల్గొన్న మంత్రి దయాకర్‌రావు, కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, ఎమ్మెల్యేలు

- సాయంత్రం 4 గంటలకు హసన్‌పర్తి బాలాజీ గార్డెన్స్‌లో కేసీఆర్ కప్ బహూకరణ కార్యక్రమం ఉంటుంది.
- 4.30 గంటలకు హనుమకొండ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం.
- 5.30 గంటలకు హంటర్‌రోడ్‌లోని సైన్స్ సెంటర్, 5.50 గంటలకు లష్కర్ బజార్ మర్కజీ స్కూల్లో నగరంలోని వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారు.
- 6.15 గంటలకు గాంధీనగర్‌లో(అంబేడ్కర్ భవన్, టీవీ టవర్ దగ్గర) మోడల్ వైకుంఠ ధామం ప్రారంభోత్సవం చేస్తారు.
- 6.45 గంటలకు సెయింట్ గాబ్రియల్ స్కూల్లో పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు.

విద్యుత్ వినియోగంపై అవగాహన అవసరం

- ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్

జనగామ: విద్యుత్ వినియోగంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్ అన్నారు. విద్యుత్ భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరా, వినియోగంపై విద్యుత్ అధికారులు, ఉద్యోగులు ఊరూరా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. వర్షాకాలం, ప్రకృతి వైపరీత్యాల సమయంలో విద్యుత్ తీగలు తెగిపోయి, స్తంభాలు విరిగి, ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోయిన సందర్భాల్లో ఎలా రక్షించుకోవాలనే దానిపై వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ సమస్యలు, ఫిర్యాదులను టోల్ ఫ్రీ నంబర్ 180042008, లేదా 1912 ఫోన్ లేదా మెసేజ్ ద్వారా తెలపాలని కోరారు.

ఎర్రజెండా రెపరెపలు

ప్రపంచ కార్మిక దినోత్సవం మే డేను సోమవారం జిల్లా వ్యాప్తంగా అన్ని రంగాల కార్మికులు వైభవంగా జరుపుకున్నారు. వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్యాలయాలు, కూడళ్లలో శ్రమశక్తికి నిదర్శనమైన ఎర్ర జెండాలు ఎగురవేసి.. అమరులకు రెడ్ సెల్యూట్ చేశారు. అలాగే డప్పుచప్పుళ్లతో పురవీధుల్లో భారీ ర్యాలీలు నిర్వహించారు. 137 ఏళ్ల క్రితం కార్మికులు తమ హక్కుల కోసం సాగించిన మహత్తర పోరాటాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

- సాక్షి, నెట్‌వర్క్



జనగామ: ర్యాలీలో పాల్గొన్న సీపీఎం, సీఐటీయూ నాయకులు, కార్మికులు - మరిన్ని చిత్రాలు 9లో▸

క్లుప్తంగా

తల్లి అంత్యక్రియలకు వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల!

- రూ.8 లక్షల విలువైన బంగారు ఆభరణాల అపహరణ

గీసుకొండ: తల్లి అంత్యక్రియలకు వెళ్లొచ్చేసరికి గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ గొర్రెకుంట జయశంకర్‌కాలనీకి చెందిన బండారి విక్రమ్ ఇంట్లో చోరీ జరిగింది. తాళం పగులగొట్టి సుమారు 14 తులాల బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారు. గత నెల 13న విక్రమ్ తల్లి చెన్నారావుపేట మండలం గురిజాలలో చనిపోయింది. దీంతో కుటుంబమంతా ఇంటికి తాళం వేసి గురిజాలకు వెళ్లింది. అనంతరం తల్లి అంత్యక్రియలు, దశదిన ఖర్మ లాంఛనాలు పూర్తి చేసుకోగా.. విక్రమ్ తన కూతురును గత నెల 30న ఇంటికి పంపించాడు. ఆమె ఇంటివద్దకు వచ్చి చూడగా తలుపు తాళం పగులగొట్టి ఉండడంతో విషయాన్ని తండ్రికి ఫోన్‌లో చెప్పింది. అతడు అక్కడికెళ్లి 100కు డయల్ చేశాడు. ఇంటిలో డ్రెస్సింగ్ టేబుల్, బీరువా తాళాన్ని పగులగొట్టి అందులోని బట్టలు, పర్సులను పడేసి దొంగలు నగలు ఎత్తుకెళ్లారు. మొత్తం ఏడు రకాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు వాటి విలువ రూ.8 లక్షలు ఉంటుందని బాధితులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని గీసుకొండ ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు, ఎస్‌ఐ సందీప్‌కుమార్ సందర్శించి వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

చెట్టును ఢీకొట్టిన కారు



కాళేశ్వరం: కాళేశ్వరంలోని ముక్తివనం పార్కు వద్ద సోమవారం కోతులను తప్పించబోయి చెట్టును కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. సోమవారం జిల్లాలోని జంగేడు గ్రామానికి చెందిన ఓడెల రమేశ్ తన కుటుంబ సభ్యులతో కలిసి కాళేశ్వరం వచ్చాడు. దర్శనం అనంతరం తిరుగు ప్రయాణమయ్యాడు. ముక్తివనం పార్కు వద్ద కోతుల గుంపు రోడ్డుపై అడ్డు రావడంతో తప్పించబోయి కారు చెట్టును ఢీకొట్టింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న రమేశ్‌కు ముక్కు, ఛాతిలో గాయాలయ్యాయి. అతడి కుమార్తె శ్రీనిజ తలకు గాయమైంది. అతడి భార్య, అల్లుడు, ఇద్దరు పిల్లలకు ఎలాంటి గాయాలు కాలేదు. దీంతో చెట్టుకు బలంగా ఢీకొట్టడంతో ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో సురక్షితంగా బయటపడ్డట్లు స్థానికులు తెలిపారు. వెంటనే అంబులెన్స్ మహదేవపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు.

'సాక్షి' మాక్ ఎంసెట్‌కు విశేష స్పందన

- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు



సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ ఎంసెట్‌లో పాల్గొన్న విద్యార్థులు

కాజీపేట రూరల్: సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాక్షి ఇంజనీరింగ్ మాక్ ఎంసెట్‌కు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. కాజీపేట సోమిడి శివారులోని తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం సాక్షి మాక్ టెస్ట్ జరిగింది. విద్యార్థులను ప్రోత్సాహిస్తూ, ఒత్తిడి తగ్గించి ఎంసెట్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించేందుకు సాక్షి నిర్వహించిన మాక్ టెస్ట్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని ఆన్‌లైన్‌లో ఈపరీక్ష రాశారు. ఈ సందర్భంగా సాక్షి జిల్లా బ్రాంచ్ మేనేజర్ వి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడంలో సాక్షి ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఇలాంటి పరీక్షలను విద్యార్థులు ఉపయోగించుకుని వారి ప్రతిభా పాటవాలను పరీక్షించుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఈవెంట్ మేనేజర్ ఎస్.సుమన్, సాక్షి బ్యూరో ఛీఫ్ జి.రాజిరెడ్డి, తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం, కాలేజ్ డైరెక్టర్ తాళ్ల వంశీ, ప్రిన్సిపాల్ డాక్టర్ వేలు సీనియర్ లెక్చరర్ మేథమెటిక్స్ కె.సాంబశివుడు, రాధాకృష్ణ అకాడమీ డైరెక్టర్ మనోహర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన వచ్చింది



సాక్షి నిర్వహించిన మాక్ ఎంసెట్‌తో ఒక అవగాహన వచ్చింది. పరీక్ష రాసే విధానం, అడిగిన ప్రశ్నల తీరుపై, సమయం కేటాయింపు అంశాలను తెలుసుకోగలిగా. ఆన్‌లైన్ పరీక్ష విధానంపై అవగాహనతో పాటు ఆందోళన తగ్గింది. భవిష్యత్‌లో ఎలాంటి పరీక్షలైనా సమర్థంగా రాయాలనే ధైర్యం వచ్చింది.

\- ప్రజ్వల్, విద్యార్థి

ప్రశ్నల తీరు తెలిసింది..



సాక్షి నిర్వహించిన మాక్ ఎంసెట్ పరీక్ష విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. నేను పరీక్ష బాగా రాశాను. మాక్ టెస్ట్‌లో ప్రశ్నలు అడిగిన తీరుపై అవగాహన వచ్చింది. సాక్షి మీడియా భవిష్యత్‌లో ఇలాంటి పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు బాసటగా నిలువాలని కోరుకుంటున్నా.

\- సుప్రియ, విద్యార్థిని

సాక్షి మాక్ టెస్ట్‌లు ఉపయోగకరం



సాక్షి మీడియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాక్ టెస్ట్‌లు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఇలాంటి మాక్ టెస్ట్‌లు మరిన్ని నిర్వహించి విద్యార్థుల భయాందోళనను తీసి వేసి ప్రోత్సాహించాలి. ఈ మాక్‌టెస్ట్ కార్యక్రమానికి మా కళాశాల వేదికైనందుకు ఆనందంగా ఉంది.

\- తాళ్ల మల్లేశం, తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్

సామాజిక దృక్పథమున్న కవిత్వంతో చైతన్యం

- ఘనంగా 'వెలుగు రవ్వలు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ శ్రీకృష్ణదేవరావు

హన్మకొండ కల్చరల్: సామాజిక దృక్పథం కలిగిన కవిత్వం సార్వజనీనమై ప్రజలను చైతన్య పరుస్తుందని, సాహిత్యానికి సమాజాన్ని సంస్కరించే శక్తి ఉందని నల్సార్ న్యాయశాస్త్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ పెండ్యాల శ్రీకృష్ణదేవరావు అన్నారు. సర్వోదయ ఆర్గనైజేషన్ సహకారంతో సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ కవి, న్యాయవాది, సహృదయ సంస్థ ఉపాధ్యక్షులు మల్యాల మనోహరరావు రచించిన వచన కవితా సంపుటి 'వెలుగు రవ్వలు' పుస్తకావిష్కరణ ఘనంగా జరిగింది. ఆదివారం రాత్రి హనుమకొండలోని హోటల్ హరిత కాకతీయలో సహృదయ సంస్థ అధ్యక్షులు మనోహరబాబు అధ్యక్షతన జరిగిన ఈసభలో ముఖ్య అతిథిగా శ్రీకృష్ణదేవరావు పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న కేయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బన్న అయిలయ్య మాట్లాడుతూ.. మల్యాల రచించిన వెలుగు రవ్వలు ప్రశ్నించే తత్వం ఉన్న పుస్తకమన్నారు. ఈసందర్భంగా వెలుగు రవ్వలు పుస్తకాన్ని కవి మల్యాల మనోహరరావు తన సతీమణికి అంకితమిచ్చారు. తన పాఠశాల గురువైన గంటా రామిరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి, రచయిత మెట్టు మురళీధర్, సహృదయ ప్రధాన కార్యదర్శి ఎన్వీఎస్‌చారి, కుందావజ్జుల కృష్ణమూర్తి, డా.ఏవీ నరసింహారావు, రాధాకృష్ణ, కళా రాజేశ్వరరావు, నాగిళ్ల రామశాస్త్రి, పొట్లపల్లి శ్రీనివాసరావు, కాంచనపల్లి రాజేందర్, అన్వర్, సహృదయ, సర్వోదయ సభ్యులు పాల్గొన్నారు.

సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి

- తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



మాట్లాడుతున్న తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీసీ రెడ్డి

హన్మకొండ: పని చేస్తున్న సంస్థ అభివృద్ధికి పాటుపడాలని తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బీసీ రెడ్డి అసోసియేషన్ సభ్యులకు సూచించారు. సోమవారం హనుమకొండ విద్యుత్‌నగర్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీసీ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యుత్ సంస్థలు కష్టాల్లో ఉన్నాయని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఇంజనీర్లుగా మనపై ఉందన్నారు. పీఆర్సీతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించుకున్నామని, ఇక నుంచి మరింత ఉత్సాహంతో పని చేయాలన్నారు. డిప్లొమా ఇంజనీర్స్‌కు అసోసియేషన్ అండగా ఉంటుందన్నారు. అసోసియేషన్‌ను మరింత పటిష్టం చేయాలన్నారు. సమావేశంలో అసోసియేషన్ ఎన్పీడీసీఎల్ శాఖ ప్రధాన కార్యదర్శి నార్ల సుబ్రహ్మణ్యేశ్వర్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నరేశ్, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.నరేందర్, ఎస్పీడీసీఎల్ జనరల్ సెక్రటరి తాజుద్దీన్, అసోసియేషన్ హనుమకొండ జిల్లా కార్యదర్శి మల్లికార్జున్, జనగామ జిల్లా కార్యదర్శి వంశీకృష్ణ, ములుగు, మహబూబాబాద్ జిల్లా కార్యదర్శులు రాజు, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా బీఆర్ఎస్



బీఆర్ఎస్ కార్మిక విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన మే డే వేడుకల్లో మంత్రి దయాకర్‌రావు

- కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్రం
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు: సంపదను సృష్టిస్తున్న కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలో బీఆర్ఎస్ కార్మిక విభాగం, ఏఐటీయూసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన మే డే వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రతా పథకం, చేనేత, బీడీ కార్మికులు, గీత కార్మికులకు బీమా, సబ్సిడీలు, పొదుపు పథకం అమలు చేస్తోందన్నారు. ఆటో, ట్రాక్టర్ కార్మికులకు ట్యాక్స్‌లు రద్దు చేసిందని, ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికుడికి రూ.5 లక్షల ఉచిత బీమా సౌకర్యం ప్రభుత్వం కల్పించిందన్నారు. బీజేపీ పాలిత 16 రాష్ట్రాల్లో బీడీలు చేసే కార్మికులను పట్టించుకోలేదన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ ప్రజలపై పన్నుల భారం మోపుతోందన్నారు. కార్మికులంతా ఐక్యంగా ఉండి కేంద్ర ప్రభుత్వ మెడలు వంచాలన్నారు. బీఆర్ఎస్ సర్కార్ హయాంలో కార్మికులు సంతోషంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు తమ్మెర విశ్వేశ్వరరావు, ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ లింగాల వెంకటనారాయణగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఆర్బీఎస్ మండల కో–ఆర్డినేటర్ అనుమాండ్ల దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిల బదిలీలు, నియామకాలు

వరంగల్ లీగల్: రాష్ట్రవ్యాప్తంగా జరిగిన జూనియర్ సివిల్ జడ్జిల బదిలీలు, నియామకాలు జారీ చేస్తూ హైకోర్టు అధికారిక వర్గాలు ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నలుగురు జూనియర్ సివిల్ జడ్జిలు ఇతర జిల్లాలకు బదిలీ కాగా.. ఒక జడ్జికి ఇదే జిల్లాలో స్థాన చలనం జరిగింది. ఇతర జిల్లాల నుంచి ఆరుగురు జూనియర్ సివిల్ జడ్జిలను వరంగల్ ఉమ్మడి జిల్లాలో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

బదిలీ అయిన వారిలో..

హనుమకొండ ఫస్ట్ ఎంఎం కోర్టు జడ్జి పి.గోపిక నాగశౌర్య ఖమ్మం పీడీఎం కోర్టు జడ్జిగా బదిలీ అయ్యారు. హనుమకొండ నాలుగో ఎంఎం కోర్టు జడ్జి మట్ట సరిత తొర్రూరు కోర్టుకు బదిలీ అయ్యారు. హనుమకొండ పీడీఎం కోర్టు జడ్జి రాపోలు అనిత సంగారెడ్డి జిల్లా సెకండ్ ఎంఎం మొబైల్ కోర్టు జడ్జిగా బదిలీ అయ్యారు. కాజీపేట రైల్వే కోర్టు జడ్జి షేక్ ఆరీఫ్ నల్గొండ జిల్లా తుంగతుర్తి కోర్టుకు బదిలీ కాగా.. జనగామ పీడీఎం కోర్టు జడ్జి డి.టి పృథ్వీరాజ్ రంగారెడ్డి జిల్లా కూకట్‌పల్లి పీడీఎం కోర్టు జడ్జిగా బదిలీ అయ్యారు.

ఉమ్మడి జిల్లాకు బదిలీపై వస్తున్న జూనియర్ సివిల్ జడ్జిలు

వరంగల్ ఫస్ట్ ఎంఎం కోర్టు జడ్జిగా ఖమ్మం పీడీఎం కోర్టు జడ్జి ఎస్వీ హైమ పూజిత బదిలీపై వస్తున్నారు. హనుమకొండ జిల్లా పీడీఎం కోర్టు జడ్జిగా ఖమ్మం ఫస్ట్ ఎంఎం కోర్టు జడ్జి ఎస్.శాంతిసోని, హనుమకొండ ఫస్ట్ ఎంఎం కోర్టు జడ్జిగా ఖమ్మం జిల్లా సత్తుపల్లి పీడీఎం కోర్టు జడ్జి సీహెచ్ శ్రావణస్వాతి బదిలీపై వస్తున్నారు. హనుమకొండ థర్డ్ ఎంఎం కోర్టు జడ్జిగా సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పీడీఎం కోర్టు జడ్జి ప్రియాంక సిరిసిల్ల, జనగామ పీడీఎం కోర్టు జడ్జిగా రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని పీడీఎం కోర్టు జడ్జి ఈ.సుచరిత బదిలీపై రానున్నారు. మహబూబాబాద్ పీడీఎం కోర్టు జడ్జిగా ఖమ్మం సెకండ్ ఎంఎం కోర్టు జడ్జి పి.మౌనిక బదిలీపై రానున్నారు.

తల్లిని చితకబాదిన ఉపాధ్యాయుడు



తల్లిని కొడుతున్న ఉపాధ్యాయుడు ప్రభాకర్

మరిపెడ రూరల్: 'చనిపోయిన తమ్ముడి కుటుంబానికి చెందిన భూమి లాక్కొని, ఆకుటుంబానికి అన్యాయం చేస్తావారా?' అని కొడుకును నిలదీసినందుకు కోపోద్రిక్తుడైన కుమారుడు కన్నతల్లిని చితకబాదాడు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గాలివారిగూడెం గ్రామానికి చెందిన చెరుకుపల్లి సూరమ్మ–లాలయ్య (లేట్) దంపతులకు ముగ్గురు కుమారులు. వీరి కుటుంబానికి సర్వే నంబర్ 206/ఈలో 4.18 ఎకరాల భూమి ఉంది. చిన్నకుమారుడు చెరుకుపల్లి అశోక్‌కు ఇద్దరు పిల్లలు కలిగిన తర్వాత అనారోగ్యంతో మృతి చెందాడు. చిన్న కుమారుడి కుటుంబానికి 18 గుంటలు, అన్నదమ్ముల భాగం కింద మరో 10 గుంటలు.. మొత్తం 28 గుంటల భూమిని గ్రామస్తుల ఆధ్వర్యంలో రాసిచ్చారు. ఈభూమిపై కన్నేసిన పెద్ద కుమారుడు ప్రభుత్వ ఉపాధ్యాయుడైన ప్రభాకర్ 28 గుంటల భూమినంతా తన భార్య అయిన వసంత పేరిట పట్టా చేయించుకున్నాడు. ఇటీవల ఈ విషయం బయట పడగా.. తల్లి సూరమ్మ ప్రభాకర్‌ను నిలదీసింది. దీంతో కన్నతల్లి అని చూడకుండా ఉపాధ్యాయుడు ప్రభాకర్ కాలుతో తన్ని చెంపలపై కొట్టి ఈడ్చి కిందపడేశాడు. 'కష్టపడి చదివించి ప్రయోజకున్ని చేసిన. అయినా.. నన్ను ఇష్టం వచ్చినట్లు కొడుతున్నావ్' అని సూరమ్మ బోరున విలపించింది. చనిపోయిన చిన్న కొడుకు కుటుంబానికి అన్యాయం జరగకుండా చూడాలని గ్రామస్తులను, అధికారులను ఆ తల్లి వేడుకుంటోంది. ఈవిషయంపై మరిపెడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు సూరమ్మ పేర్కొంది.

సమీకృత చేపల పెంపకం చేపట్టాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న

కరీమాబాద్: వ్యవసాయానికి అనుబంధంగా రైతులు సమీకృత చేపల పెంపకం చేపట్టాలని మామునూరు కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న అన్నారు. జాతీయ మత్స్య అభివృద్ధి మండలి, మామునూరు కేవీకే, పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఐదు రోజుల శిక్షణ శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. చేపల పెంపకంలో భారత దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మూడో స్థానంలో ఉందని చెప్పారు. చేపల మాంసం మంచి పోషకాహారం అని చెబుతూ అందులో ఒమేగా ఫ్యాటీ ఆసిడ్స్ కూడా అధికంగా ఉంటాయన్నారు. చేపల పెంపకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాలేరు మత్స్య పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ యం.శ్యాంప్రసాద్ మాట్లాడుతూ.. తెలంగాణలో చేపల పెంపకానికి అనువైన నేలలున్నాయని తెలిపారు. చేపల పెంపకంలో యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ గణేశ్, డాక్టర్ రాజు, డాక్టర్ శశాంక్, డాక్టర్ సాయికిరణ్, రైతులు పాల్గొన్నారు.

డబ్బులిప్పించాలని అర్ధనగ్న ప్రదర్శన



నిరసన తెలుపుతున్న అంజయ్య, ఐలయ్య

తరిగొప్పుల: అప్పుగా ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరితే బీఆర్ఎస్ నాయకుడు బెదిరింపులకు పాల్పడుతున్నాడని మండల కేంద్రానికి చెందిన ఆవుల అంజయ్య, సుంకరి ఐలయ్య వాపోయారు. ఈమేరకు వారు సోమవారం తరిగొప్పుల–చేర్యాల రోడ్డుపై బైఠాయించి అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. ఈవీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు తాళ్లపల్లి పోశయ్య కుమారుడు తాళ్లపల్లి రవి అంజయ్య వద్ద రూ.4 లక్షలు, అయిలయ్య వద్ద రూ.1 లక్ష అప్పుగా తీసుకున్నాడని, తిరిగి ఇవ్వాలని అడిగితే ఐపీ పెట్టి కోర్టు ద్వారా నోటీసులు పంపించాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులిప్పించి న్యాయం చేయాలని, లేదంటే ఆత్మహత్యే శరణ్యమని వారు వాపోయారు. ఈవిషయమై తాళ్లపల్లి పోశయ్యను ఫోన్‌లో సంప్రదించేందుకు యత్నించగా స్విచ్ ఆఫ్ వచ్చింది.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి



చింటు (ఫైల్)

కాజీపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద చికిత్స పొందుతున్న కాజీపేట 62వ డివిజన్ సోమిడి గ్రామానికి చెందిన గిన్నారపు చింటు (28) సోమవారం మృతి చెందాడు. చింటు దాదాపు 3 నెలల క్రితం టేకులగూడెం ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో ద్విచక్ర వాహనంపై వస్తుండగా ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లిన అతడిని ఆస్పత్రిలో చేర్పించగా మెరుగైన చికిత్స కోసం చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ నిమ్స్ ఆసుపత్రికి తరలించడానికి తోడ్పాటును అందించారు. ప్రభుత్వ ఎల్‌ఓసీని ఇప్పించి వైద్యం చేయించారు. చింటు కుటుంబ పరిస్థితి తెలిసిన గ్రామస్తులు, బంధు,మిత్రులు ఆర్థికంగా చేయూతనందించారు. ఇటీవలే కోమాలోంచి బయటకు వచ్చిన చింటు ఇంటి వద్ద ఉండి వైద్యం చేయించుకుంటున్నారు. సోమవారం తీవ్ర అస్వస్థతకు గురైన అతడు మృతి చెందాడు. కుటుంబ సభ్యులతో పాటు బంధు మిత్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

రైలు నుంచి జారి పడి ఒకరు..

జనగామ రూరల్: రైలు నుంచి జారి పడి సోమవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. జీఆర్పీ ఎస్సై సీహెచ్.పరశురామ్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ నుంచి విజయవాడకు టికెట్ తీసుకుని వెళ్తున్న ఓ గుర్తు తెలియని (సుమారు 35 నుంచి 45 వయసు) వ్యక్తి రఘునాథపల్లి–జనగామ రైల్వే ట్రాక్ మధ్య గల స్టేషన్ పరిధిలో ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందాడు. మృతుడికి చెందిన ఎలాంటి ఆధారాలు లేవని గుండ్రటి ముఖం, మెడ చేతిపై త్రిశూలం కలిగిన పచ్చబొట్టు, అతడి ఒంటిపై ఆకుపచ్చ డిజైన్ కలిగిన ఫుల్ షర్ట్, నలుపు నీలి రంగు పాయింట్, గల్లాపై మధు టైలర్ జవహర్‌నగర్ హైదరాబాద్ అని రాసి ఉంది. వివరాలకు 94906 19031, 9866 330257 నంబర్లలో సంప్రదించాలని జీఆర్పీ ఎస్సై తెలిపారు.

చేప పది కిలోలు!



కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డలోని లక్ష్మీబ్యారేజీలో సోమవారం మత్స్యకారులకు పదికిలోల చేప చిక్కింది. ఈచేపను మహదేవపూర్‌కు చెందిన బి.శేఖర్ అనే వ్యక్తి రూ.1500కు కొనుగోలు చేశాడు.

మహా జాతరకు ముందస్తుగా పోలీస్‌శాఖ సిద్ధం



జాతర ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఎస్పీ గాష్ ఆలం

ఎస్ఎస్‌తాడ్వాయి: వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న సమ్మక్క–సారలమ్మ మహా జాతరలో పకడ్బందీ ఏర్పాట్లపై పోలీసు శాఖ సిద్ధమవుతోంది. ఈమేరకు సోమవారం మేడారంలోని ఐటీడీఏ అతిథి గృహంలో ఎస్పీ గాష్ ఆలం జాతరలో చేపట్టాల్సిన ఏర్పాట్లు, జాతర విజయవంతంపై పోలీసు అధికారులతో ముందస్తు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆసియా ఖండంలోనే అతి పెద్ద జాతరకు సుమారుగా 2 కోట్ల మంది భక్తులు హాజరవుతారని జాతరలో భక్తుల భద్రత ఏర్పాట్లపై ఎస్పీ సమీక్షించారు. గత మహా జాతరలో పని చేసిన అధికారుల అనుభవాలు, లోటు పాట్లపై సమీక్షించారు. వచ్చే జాతరలో విధులు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఇంకా మెరుగైన సౌకర్యాలపై అంశాల వారీగా చర్చించారు. ప్రధాన రహదారులు భద్రత, మరమ్మతులు, భక్తుల రద్దీ నియంత్రణ, భక్తులకు అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రతలపై సమీక్షించారు. సమావేశంలో అదనపు ఎస్పీ సదానందం, డీఎస్పీ రవీందర్, సీఐ స్పెషల్ బ్రాంచ్ శ్రీనివాస్, సీసీఎస్ సీఐ, రవీందర్, సీఐలు రంజిత్‌కుమార్, శంకర్, కమ్యూనికేషన్ సీఐ రోహిత్, ఆర్ఐ అడ్మిన్ వెంకటనారాయణ, ఆర్ఐ హోంగార్డ్స్ స్వామి, ఎస్ఐలు కర్ణాకర్‌రావు, వెంకటేశ్వరరావు, పవన్‌కుమార్, తాజుద్దీన్, రమేశ్, తాహీర్‌బాబా, పీఎస్ఐ శ్రవణ్‌కుమార్ ఉన్నారు.

చిత్రకారుడిగా గర్విస్తున్నా..

- ఎంపీ పసునూరి దయాకర్
- డ్రాయింగ్ శిక్షణ శిబిరం ప్రారంభం



బొమ్మ గీస్తున్న ఎంపీ దయాకర్

హన్మకొండ చౌరస్తా: 'బొమ్మలు గీయడం ఓ అద్భుతమైన కళ. నేను ఒక చిత్రకారుడినని చెప్పుకోవడానికి గర్విస్తున్నా' అని వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ అన్నారు. సాగంటి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో హనుమకొండ కేఎల్ఎన్‌రెడ్డి కాలనీలోని సత్యం పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన డ్రాయింగ్ శిక్షణ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. సీఎం కేసీఆర్ తనను చిత్రకారుడిగా గుర్తించిన తర్వాతనే ఎంపీగా అవకాశం కల్పించాడన్నారు. అకాడమీ డైరెక్టర్ మంజుల మాట్లాడుతూ.. నెల రోజుల పాటు ప్రతీ రోజు ఉదయం 9 నుంచి 11 వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్, ప్రముఖ రచయితలు మహ్మద్ సిరాజ్, బిల్లా మహేందర్, విద్యావేత్త బూర విద్యాసాగర్‌గౌడ్, ట్రాఫిక్ సీఐ విజయ్ కుమార్, ఆలేటి శ్యాం, స్కూల్ కరస్పాండెంట్ చెరుకు వేణు, దేవిక, రజిత, సంధ్య పాల్గొన్నారు.